ప్రజాశక్తి
సోమవారం 4 సెప్టెంబర్ 2023
5
అనంతపురం





కదిరి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

కదిరి మండల పరిధిలోని ఎర్రదొడ్డి గ్రామం వద్ద ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. కారు, ఆటో ఢీకొన్న ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మరొకరు మృతిచెందారు.

పూర్తి వార్త 6వ పేజీలో

పోలా రామాంజనేయులు అస్తమయం

◆చేనేత ఉద్యమ కెరటంగా గుర్తింపు
◆ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం
◆తుదిశ్వాస వరకు ఉద్యమాలే శ్వాసగా బతికిన నేత
◆ ప్రముఖుల నివాళి
◆నేడు ధర్మవరంలో అంత్యక్రియలు

చేనేత ఉద్యమ కార్మిక కెరటం...
ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం...
చేనేత సమస్య అనగానే గుర్తుకు వచ్చే కార్మిక నేత..
నాలుగు దశాబ్దాల పాటు ప్రజా పొరాట జీవనం ...
నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు ఎర్రజెండాను వీడని కామ్రేడ్...
హ్యాండ్‌లూమ్ పరిరక్షణ కోసం నిరంతరం పరితపించిన నేతన్న నేస్తం.....

నాలుగు దశాబ్దాల పాటు ప్రజా ఉద్యమాన్నే జీవనంగా భావించిన చేనేత కార్మిక ఉద్యమనేత పోలా రామాంజనేయులు(71) అనారోగ్య సమస్యలతో ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. చేనేత రంగం అనగానే గుర్తుకు వచ్చే నాయకుడిగా కామ్రేడ్ పోలా రామాంజనేయులు గుర్తింపు పొందారు. పోరాటమే ఊపిరిగా తుదిశ్వాస వరకు జీవనం సాగించారు. కార్మిక, కర్షక, కూలీల సమస్యలపై పోరు సాగించారు. ఉద్యమాన్ని భావితరాలకు అందించి, పోరాట చైతన్య స్ఫూర్తిని నేటి తరానికి అందించిన నేత కన్నుమూశారు.




ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగిన ఆందోళనలో పాల్గొన్న పోలా రామాంజనేయులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
ధర్మవరం టౌన్, పుట్టపర్తి రూరల్

పోలా రామాంజనేయులు పేరు చెబితేనే చేనేత కార్మికుల పోరాటం గుర్తుకు వస్తుంది. నాలుగు దశాబ్ధాలకుపైగా చేనేత వత్తి రక్షణకై రాజీలేని పోరాటాన్ని సాగించారు. అధికార పార్టీ ఒత్తిళ్లు, కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నాలు చేసినా రాజీపడకుండా చివరి ఆయువు వరకు ఆ వత్తి రక్షణకై పనిచేసిన ఎపి చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు ఆదివారం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న ఆయన అనంతపురం నగరంలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం విషమించి ఆదివారం తుదిశ్వాస విడిచారు.

చేనేత వత్తి రక్షణకై రాజీలేని పోరాటం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయం తరువాత అత్యధిక మంది ఆధారపడిన వృత్తి చేనేత రంగం. అందులోనూ ధర్మవరం చేనేతకు పెట్టింది పేరు. ధర్మవరంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక రూపంలో చేనేతపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో చేనేత రంగం, కార్మికులకు అండగా పోలా రామాంజినేయులు నిలిచారు. ఎప్పటిప్పుడు కార్మికుల రక్షణ కోరుతూ వారి కోసం నిరంతరం శ్రమించారు. హ్యాండ్‌లూమ్ స్థానంలో పవర్‌లూమ్స్ తీసుకురావాలని పాలకులు అనేక సంవత్సరాలుగా ప్రయత్నాలు సాగిస్తూనే వచ్చారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పోలా రామాంజనేయులు కీలకంగా పనిచేశారు. 2000 సంవత్సరం కాలంలోనే పవర్‌లూమ్స్‌కు ప్రయత్నాలు జరిగితే దీనికి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి సిపిఎం నాయకులు కొరటాల సత్యనారాయణ, మహత్మాగాంధీ మనువడు ధర్మవరం విచ్చేశారు. ఇక్కడ పవర్‌లూమ్స్ ఏర్పాటు చేయకూడదంటూ పెద్దఎత్తున సాగిన పోరాటంలో పాల్గొన్నారు. ఈ పోరాటంలో పోలా రామాంజనేయులు కీలకంగా వ్యవహరించారు. నేతన్నలను ఐక్యం చేసి పవరలూమ్స్ ధర్మవరం రాకుండా పోరాటం చేశారు. ఆ సమయంలో ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఈ పోరాట ఫలితంగా పవర్‌లూమ్స్ జిల్లాకు రాకుండా అడ్డుకోగలిగారు. పోరాటం సాగిస్తున్న నాయకులు, అందులోనూ ప్రముఖభూమిక వహిస్తున్న పోలా రామాంజినేయులును కట్టడి చేయడానికి ఆయనపై తప్పుడు హత్యకేసును సైతం అప్పటి కాంగ్రెసు నాయకులు మోపారు. పవర్‌లూమ్స్‌కు అనుకూలంగా వ్యవహరిస్తే ఈ కేసును ఎత్తివేస్తామని ఒత్తిడులు తెచ్చినా పోలా వారితో రాజీపడకుండా కార్మికులకు మద్దతుగా పోరాటాన్ని సాగించారు. పవర్‌లూమ్స్‌ను జిల్లాలో ఏర్పాఉ చేయకుండా అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్‌తో ఓ కమిటీని ఏర్పాటు చేయించి జీవోను సైతం తెచ్చారు. చేనేత రిజర్వేషన్ యాక్టు అమలు చేయాలని నిరంతరం పోరాటం సాగించారు. మూడు పర్యాయాలు ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులుగానూ పనిచేశారు. గతేడాది ఎమ్మిగనూరులో జరిగిన ఎపి చేనేత కార్మిక సంఘం మహాసభల్లో మూడవ సారి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.



పోలా రామాంజనేయులు (ఫైల్ ఫొటో)

కౌన్సిలర్‌గానూ ప్రాతినిధ్యం

పోలా రామాంజినేయులు ఒక్క చేనేత కార్మిక సంఘం నాయకుడిగానే కాకుండా ప్రజా నాయకుడిగానూ పనిచేశారు. ధర్మవరం పురపాలక సంఘంలో 32వ వార్డుకు రెండుసార్లు కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. వామపక్ష పార్టీ నాయకులు కౌన్సిలర్‌గా గెలవడం ఏమిటంటూ భూర్జువా పార్టీల చర్యలను తిప్పికొడుతూ ఆయన ధర్మవరం మున్సిపాల్టీకి రెండు సార్లు కౌన్సిలర్‌గా ఎన్నిక అయ్యారు. కౌన్సిలర్‌గా ఉన్న సమయంలో ప్రజా సమస్యలపై పురపాలక సంఘంలో పోరాటం సాగించారు. అనునిత్యం అధికారులు, పాలకవర్గాన్ని తన పదునైనా మాటలతూటాలతో ప్రశ్నించారు. ఓ వైపు కౌన్సిలర్‌గా మరో వైపు కార్మిక సంఘం నాయకుడిగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపైనా పోరాటం..

పరిగిలో జరిగిన ఎస్ఎ.రావత్ పరిశ్రమలో కార్మికుల సమస్యలపై పోరాటం చేశారు. పరిగి నుంచి అనంతపురం వరకు సాగిన యాత్రలోనూ కీలకంగా వ్యవహరించారు. ధర్మవరంతో పాటు, పరిసర మండలాల్లో నిర్వహించిన భూపోరాటాల్లోనూ పాల్గొన్నారు. చేనేత కార్మికులకు మగ్గాలు వేసుకునేందుకు అనువుగా రెండు సెంట్లకు పైగా స్థలాన్ని ఇచ్చి గృహాలు నిర్మించి ఇవ్వాలన్న డిమాండ్‌తో ఆయన ఉద్యమాలను సాగించారు. ఇదే విషయంపై మంత్రులు, ముఖ్యమంత్రుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ధర్మవరానికి అధికారంలో ఉన్న ఏ ముఖ్య నాయుడు వచ్చినా చేనేత సమస్యలపై మాట్లాడాలంటే పోలా రామాంజినేయులును సంప్రదించేవారు. చేనేతపై ఆయనకు ఉన్న పట్టు, సమస్యల పరిష్కారంపై ఆయనకు ఉన్న చిత్త శుద్ధి నాయకులను సైతం ఆలోచింపజేసేది. ఇలా జీవితకాలం మొత్తం చేనేత, కార్మిక, ప్రజా సమస్యలపై పోరాటం సాగించిన నాయకుడిగా పోలా రామాంజనేయులు గుర్తింపు పొందారు.

పలువురి సంతాపం

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిపిఎం సీనియర్ నాయకులు, ధర్మవరం మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పోలా రామాంజనేయులు మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలియజేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రగాఢ సంతాపం తెలిపారు. చేనేత కార్మికుల పక్షాన అనేక పోరాటాలు చేశారని గుర్తుచేసుకున్నారు. సిపిఎం ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులుగా, సత్యసాయి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా పనిచేసిన ఆయన అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ చివరి వరకు పేదల కోసం పోరాడారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, సత్యసాయి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, అనంతపురం జిల్లా నాయకులు బాలరంగయ్య, రామిరెడ్డి తదితరులు ధర్మవరంలో పోలా రామాంజనేయులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నేడు ధర్మవరంలో అంత్యక్రియలు

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజినేయులు అంత్యక్రియలు సోమవారం నాడు జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు ధర్మవరంలో ఆయన నివాసం నుంచి అంత్యక్రియలను నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను చేస్తున్నారు.





పోలా రామాంజనేయులు భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న రాంభూపాల్, ఓబులు, ఇంతియాజ్ తదితరులు



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారితో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ఫలించిన పోరాటం

శ్రీసత్యసాయి కార్మికులతో అధికారుల చర్చలు సఫలం
సమ్మె విరమణ ... విధుల్లోకి కార్మికులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వేతన బకాయిలు, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ వంటివి చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికులు చేపట్టిన పోరాటం ఫలించింది. కార్మికులతో అధికారులు జరిపిన చర్చలు సఫలమయ్యాయి. నిరవదిక సమ్మెతో తాగునీటి సరఫరా నిలిచిపోయి జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులతో నిర్వహించిన చర్చలు సఫలవంతం అయ్యాయి. ఆదివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ కార్యాలయంలో నిర్వహించిన చర్చలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ అసన్‌బాషా, డీఈ రామారావు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీసత్యసాయి కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుల జి.ఓబులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, శ్రీసత్యసాయి కార్మికుల యూనియన్ అధ్యక్షులు ఈశ్వరయ్య, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి శ్రీరాములు, మాజీ నాయకులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు వన్నూరప్ప, ప్రసాద్, రవీంద్రాచారి, లక్ష్మిరెడ్డి తదితరులు హాజరయ్యారు. కార్మికులకు 2 నెలల వేతనాలు ప్రస్తుతం చెల్లిస్తూ, మూడు నెలల వేతనాలు సెప్టెంబర్ 20 లోగా చెల్లిస్తామని అధికారులు తెలిపారు. అంతేకాకుండా 8 నెలల పిఎఫ్ పూర్తిగా చెల్లిస్తామని 18 నెలల ఇఎస్ఐ బకాయిలు చెల్లిస్తామనిఅక్టోబర్ నెల నుంచి వేతనం రూ.500 పెంపుదల చేస్తామని ప్రకటించారు. నెలకు బోనస్ రూ.1100 పెంపుదల చేసి చెల్లిస్తున్నట్లు తెలిపారు. సంవత్సరానికి 18 రోజులు సెలవులు పెట్టుకోవచ్చన్నారు. దీంతో అధికారులు ఇచ్చిన హామీలకు కార్మిక సంఘాల నేతలు అంగీకరిస్తూ సమ్మె విరమిస్తున్నట్లు తెలిపారు. దీంతో కార్మికులు 19 రోజుల రిలే దీక్షలు, 10 రోజుల పాటు నిర్వహించిన నిరవదిక సమ్మె విరమించినట్లు అయింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేసిన జిల్లా కలెక్టర్, శ్రీసత్యసాయి బోర్డ్ చైర్మన్ ఎం.గౌతమికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ, ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. పిఎఫ్ సక్రమంగా పడటం లేదని, ప్రతి నెలా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌టి సంస్థ ఉన్నప్పుడు సబ్ కాంట్రాక్టర్లు 100 మంది కార్మికులకు సంబంధించిన పిఎఫ్ చెల్లించాల్సి ఉందని, అవి చెల్లించేలా చూడాలని కోరారు. సమ్మె సందర్భంగా కక్ష సాధింపు చర్యలు ఉండకూడదన్నారు. సమ్మె కాలానికి వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలన్నారు. తాడిపత్రి పంప్ హౌస్‌లో పని చేస్తున్న సూపర్‌వైజర్ శంకర్ కార్మికుల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన అధికారులు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. సమ్మెకు సహకరించిన కార్మిక, రైతు, కౌలు రైతు, విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజలు, మీడియా ప్రతినిధులు, అధికారులకు సిఐటియు రాష్ట్ర కమిటీ, స్ట్రగుల్ కమిటీ, శ్రీసత్యసాయి శ్రీరామిరెడ్డి కార్మికుల యూనియన్ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మోటార్ పంప్‌లు ఆన్ చేసి నీటి సఫరాను అధికారులు ప్రారంభించారు. కార్మికుల పోరాట ఫలితంగా వేతనాల చెల్లింపు జరిగాయని, కార్మికులు ఐక్యంగా ఉండి హక్కుల కోసం నిలబడితే సమస్యలు పరిష్కారమవుతాయన్న సత్యం రుజువైందని నాయకులు ఈసందర్భంగా అన్నారు.



చిలమత్తూరు మండలంలో ఎండిపోతున్న పంటపొలం వద్ద దిగాలుగా కూర్చొన్న రైతు

ఉమ్మడి 'అనంత'లో కమ్ముకున్న కరువు

పాలకుల సేవలో అధికారులు...
ఎన్నికల యావలో అధికార, ప్రతిపక్ష పార్టీలు
ఎండుతున్న పంటలు...అడుగంటిన భూగర్భ జలాలు
ఉక్కిరి బిక్కిరి అవుతున్న రైతన్నలు


ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా చినుకు రాలక పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. జిల్లాలో వానలే తక్కువ. అందులోనూ లోటు వర్షపాతం. ఈ ఏడాది ఖరీఫ్‌పై రైతన్నలు ఆశలు వదులుకున్నారు. జూన్‌లో కురిసిన చిన్న వర్షానికే రైతులు వరుణుడిపై ఆశలు పెట్టుకుని విత్తనం వేశారు. అయితే చినుకు జాడే లేకపోవటంతో ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా కరువు కమ్ముకువస్తూంది. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన అధికారులు పాలకుల సేవలో తరిస్తున్నారు. అధికార, ప్రతిపక్షపార్టీలు ఎన్నికల యావలో ఉన్నాయి. రైతన్నలను ఆదుకోవాలని కమ్యూనిస్టులు గళం విప్పుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

ప్రజాశక్తి-హిందూపురం

దుక్కి దున్ని, విత్తనం వేయడానికి సిద్ధంగా ఉన్నా వరుణుడు కరుణించకపోవడం, మరోవైపు రోజురోజుకు భూగర్భజలాలు అడుగంటి పోవడంతో జిల్లాలో అనావృష్టి పరిస్థితులు నానాటికీ తీవ్రతరమవుతున్నాయి. ఖరీఫ్ సీజన్ వచ్చి దాదాపు మూడు నెలలు అవుతోంది. ఈ పాటికి సమృద్ధిగా వర్షాలు పడి, పంటలు కళకళలాడుతూ ఉండాలి. అయితే ఈ ఏడాది పరిస్థితి దారుణంగా ఉంది. వర్షాకాలంలో మండు వేసవిని తలపిస్తోంది. వరుణుడు ముఖం చాటేశాడు. వానలోటు ఎక్కువగా ఉంది. వర్షాధార పంటల సాగు చాలా తగ్గింది. భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. దీనికి తోడు విద్యుత్‌కోతలతో మోటార్లు సరిగా పని చేయట్లేదు. గాలి, ఎండ తీవ్రతతో వాతావరణంలో తేమ ఉండట్లేదు. ఈ ఏడాది ఖరీఫ్‌పై రైతన్నలు ఆశలు వదులుకున్నారు. తొలకరి నుంచే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్‌లో లోటు వర్షపాతంతో చాలామంది పంట వేయలేదు. జులైలో ఓ మోస్తారు వర్షం కురవడంతో రైతులు అరకొరగా సాగు చేసిన పంటలు తమ కళ్లే ఎదుటే ఎండు ముఖం పట్టాయి. కనీసం ఆగస్టు నెలలో అయిన వర్షాలు కురుస్తాయనిఆశించిన రైతులకు నిరాశ మిగిలింది. ఈ దయనీయ పరిస్థితికి పాలకుల నిర్లక్ష్యం తోడైంది. అప్రకటిత విద్యుత్ కోతలు, లోవోల్టేజీ కారణంగా బోర్ల కింద సాగు చేసిన పంటలు చేతికి అందని దుస్థితి నెలకొంది. దిక్కుతోచక రైతులు పంటను కాపాడుకోవడానికి కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లతో పంటలకు తడి అందిస్తున్నారు. దీనిపై నోరు విప్పాల్సిన పాలకులు, పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టాల్సిన ప్రతి పక్షం వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి అధికారాన్ని చేపట్టాలని ఎన్నికల యావలో పడింది. కరువుపై ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్న కమ్యూనిస్టుల ఆందోళనలు అధికారులైనా ఆలకిస్తారనుకుంటే వారు పాలకుల సేవలో మునిగి తేలుతున్నారు. దీంతో ఉమ్మడి అనంత జిల్లా రైతులు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక దిక్కు తోచని స్థితిలో పడ్డారు.

సాగు లేనట్టేనా...?

ఖరీఫ్‌లో వింత ధోరణి ఏర్పడి జిల్లా వ్యాప్తంగా ఎక్కువ మొత్తంలో భూములు ఖాళీగా ఉన్నాయి. ఆగస్టు చివరి వారమైనా వర్షం రాకపోవటంతో చాలాచోట్ల సేద్యం లేక భూములు బీళ్లుగా ఉన్నాయి. రైతులు విత్తనాలు తీసుకున్నప్పటి మంచి వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. కనీసం పొలంలో దుక్కి చేసుకోవడానికి కూడా వర్షాలు కురవడం లేదని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో వేరుశనగ, మొక్కజొన్న, పప్పు ధాన్యాలు సాగు చేసే రైతులు పంట సేద్యంపై ఆశలు వదులుకున్నారు. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి రైతులకు ఉత్సాహంగా కనిపించడం లేదు. వేసిన పంట కూడా వర్షాభావం కారణంగా ఎండిపోతున్నాయి.



కనిపించని ప్రత్యామ్నాయ చర్యలు

ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా ప్రధానపంట అయిన వేరుశనగ సాగుకు అదను అయిపోయింది. దీంతో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారే తప్ప క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్నా వర్షం కురవాల్సిందే. ఒక అదను వర్షం కురిసినా ఉలవ, పెసర, అలసంద, జొన్న, కంది తదితర పంటలు సాగు చేసుకోవచ్చని దీంతోకనీసం పశువులకు గడ్డి అయిన దొరుకుంతదని రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉన్న మూగజీవాల్లో సగం అమ్ముకుని మిగిలిన వాటిని కాపాడుకోవాలని పాడి రైతులు అంటున్నారు.

హమ్మయ్య.. చినుకు జాడ ....

ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడ పడిన వర్షం
చాలా మండలాల్లో కానరాని చినుకు జాడ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కీలకమైన ఆగస్టు మాసంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో చినుకు జాడ కనిపించలేదు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి సమయంలో శనివారం రాత్రి నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో అక్కక్కడ ఒక మోస్తరు వర్షపాతం నమోదయింది. ఇది కాస్త ఊరటనిచ్చే అంశమైనప్పటికీ ఇంకా అన్ని ప్రాంతాల్లోనూ వర్షం పడలేదు. అనంతపురం జిల్లాలో 17 మండలాల్లో వర్షపాతం నమోదవగా, సత్యసాయి జిల్లాలో 11 మండలాల్లో ఒక మోస్తరు నుంచి చిరుజల్లులు పడ్డాయి.

పుట్లూరులో అత్యధికం

అనంతపురం జిల్లాలో పుట్లూరు మండలంలో అత్యధికంగా 111.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షం బాగా రావడంతో వాగుల్లోనూ, వంకల్లోనూ నీటి ప్రవాహం కనిపించింది. ఇక ఆత్మకూరులో 71.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. యల్లనూరులో 63.2 మిల్లీమీటర్లు, తాడిపత్రిలో 55.4 మిల్లీమీటర్లు , యాడికిలో 38.2మిల్లీమీటర్లు, పెద్దపప్పూరులో 24.6 మిల్లీమీటర్లు, నార్పలలో 24.6 మిల్లీమీటర్లు, శింగనమలలో 19.2 మిల్లీమీటర్లు, బుక్కరాయసముద్రంలో 12.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. రాప్తాడు, గుత్తి, పెద్దవడుగూరుల్లో తేలికపాటి వర్షపాతం నమోదయింది.

సత్యసాయిలో గాండ్లపెంటలో అత్యధికం

సత్యసాయి జిల్లాలో కదిరి ప్రాంతాల్లోనే అత్యధికంగా వర్షపాతం నమోదయింది. ఆ పది మండలాల పరిధిలోనే ఇప్పుడు పడుతున్న వర్షం ఎక్కువగా ఉండటం గమనార్హం. గాండ్లపెంటలో అత్యధికంగా 82.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. ఎన్‌పికుంటలో 52 మిల్లీమీటర్లు, తనకల్లులో 46 మిల్లీమీటర్లు, తలుపులలో 41.5 మిల్లీమీటర్లు, నల్లచెరువులో 40.5 మిల్లీమీటర్లు, ధర్మవరంలో 31.5 మిల్లీమీటర్లు, కదిరిలో 31 మిల్లీమీటర్లు నమోదయింది. ఇవి కాకుండా చెన్నేకొత్తపల్లి, ముదిగుబ్బ, బత్తలపల్లి తదితర ప్రాంతాల్లోనూ తేలికపాటి వర్షాలు పడ్డాయి.



పుట్లూరు మండలంలో చెరువులోకి చేరిన వర్షపునీరు

45 మండలాలు వర్షాభావంలోనే

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మండలాలుంటే ఇప్పటికీ ఇంకా 45 మండలాలు వర్షాభావంలోనే ఉన్నాయి. అందులో అనంతపురం జిల్లాలో 22 మండలాలుండగా, సత్యసాయి జిల్లాలో 23 మండలాలున్నాయి. అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు సగటు వర్షపాతం 150.2 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా216.7 మిల్లీమీటర్లు నమోదయింది. 30.7 శాతం లోటుంది. ఇక సత్యసాయి జిల్లాలో సగటు158.9 మిల్లీమీటర్లకుగానూ 239.8 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 33.7 శాతం లోటుంది.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.వి.సుబ్బారావు





ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరువు వెంటాడుతూనే ఉంది. నాలుగైదు ఏళ్లుగా అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు ఎంతగానో నష్టపోతూనే ఉన్నారు. ఈఏడాది జూన్‌లో విత్తనాలు వేయాల్సి ఉండగా తీవ్ర వర్షాభావం వల్ల సత్యసాయి జిల్లాలో సగం విస్తీర్ణంలో కూడా సాగు చేయలేదు. ఈనేపథ్యంలో జిల్లా వ్యవసాయ రంగంలో తీసుకుంటున్న మార్పులు, సమస్య పరిష్కారంపై జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్‌వి సుబ్బారావును ప్రజాశక్తితోవివరించారు.

ప్రశ్న : వ్యవసాయ రంగంలో ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

జవాబు : వ్యవసాయ రంగంలో ఇటీవల శాస్త్రవేత్తలు ఎన్నో పరిశోధనలు జరిపి వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తేవడానికి వినూత్న పద్ధతులను రైతులకు సూచిస్తున్నారు, వాటి ద్వారా రైతులకు మేలు చేకూరే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. మారుతున్న కాలాన్ని బట్టి పురుగుమందుల పిచికారీ, ఎరువులు చల్లడంలో వినూత్న పద్ధతి ద్వారా డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. డ్రోన్‌ను వినియోగించడానికి యువతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఒక్కొక్క మండలంలో ఒక పైలెట్ ఆపరేటర్ను ప్రభుత్వం నియమించ నుంది ఒక్కొక్క పైలెట్ 5 లక్షల రూపాయల సబ్సిడీతో 15 లక్షల రూపాయలు విలువచేసే డ్రోన్లు కొనుగోలు చేసుకొనుటకు అవకాశం కల్పించారు. వీటిని 40 శాతం సబ్సిడీ 10 శాతం కాంట్రిబ్యూషన్ చెల్లించడంతో మిగిలినది లోన్ పరంగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా నిరుద్యోగ పుట్టభద్రులకు మంచి అవకాశం.

ప్ర : శ్రీసత్యసాయి జిల్లాలో ఈసారి పంటల పరిస్థితి?

జ : ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృశ్య జిల్లావ్యాప్తంగా వేరుశనగ పంట విస్తీర్ణం బాగా తగ్గింది. అంతేకాక అంతర్ పంటలకు సైతం వేయడానికి రైతులు మక్కువ చూపలేదు. ఈఏడు జిల్లాలో వర్షపాతం 3.27 సెంటీమీటర్లు మాత్రమే నమోదైంది. జిల్లావ్యాప్తంగా 32 మండలాల్లో కేవలం 6 మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. వేరుశనగ పంపిణీ మాత్రం రైతులకు సకాలంలో అందజేసిన వర్షం అదునులో కురువకపోవడంతో వేరుశనగ విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. రైతుల అవసరాన్ని బట్టి వేరుశనగ పంపిణీ చేశాం. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న కారణంగా ఉలవలు, సజ్జలు రాగలను, ప్రభుత్వం ప్రస్తుతం రైతులకు సబ్సిడీ ధరలకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. ఇప్పుడు ఉలవలు వేసుకోవడానికి అనుకూల వాతావరణ ఉన్నందున రైతులకు హెక్టారుకు 10కిలోల చొప్పున పంపిణీ చేస్తున్నాం. కావలసినవారు రైతు భరోసా కేంద్రాల్లో వాటిని పొందవచ్చు.

ప్ర : నాసిరకం విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోయిన రైతులను ఆదుకుంటున్నారా?

జ : నాసిరకం విత్తనాలు తీసుకుని చాలామంది రైతులు పంటలను నష్టపోయారు. ఏ కంపెనీ విత్తనాలు తీసుకున్న వాటి బిల్లులు, ఫౌండేషన్ బ్యాగులు, విత్తనాలు ఇచ్చిన బ్యాగులను భద్రంగా ఉంచుకోవాలని పంట దిగుబడి రాకపోతే నష్టపోయిన ఆ కంపెనీలపై శాఖ పరంగా చర్యలు తీసుకుంటాం. సత్యసాయి జిల్లా రైతులు ఎక్కువ శాతం కర్ణాటక ప్రాంతంలోని ఉత్పత్తి అయ్యే విత్తనాలు తీసుకొని పంటలు సాగు చేస్తున్నారు. కర్ణాటకలో విత్తనాలు తీసుకొని నష్టపోయిన రైతులకు ఎలాంటి నష్టపరిహారం అందించలేం. కర్ణాటక విత్తనాల ఉత్పత్తి కంపెనీలపై చర్యలు తీసుకోవడానికి వీలు లేదు. రైతులు నష్టపోకుండా కాలానుగుణంగా పంటలు సాగు చేసుకోవాలి. మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు, రాగలు తదితర పంటలు వేయడానికి అనుకూలంగా ఉంది.

ప్ర : చిరుధాన్యాల సాగుకు రైతులకు ఎలాంటి ప్రోత్సాహనిస్తున్నారు?

జ : జిల్లావ్యాప్తంగా చిరుధాన్యాల ఉత్పత్తి అధికంగా ఉంది జిల్లాలో 110 హెక్టర్లలో చిరుధాన్యాలు సాగు చేస్తున్నారు. కాలానుగుణంగా వాటి ప్రాధాన్యత పెరుగుతోంది జిల్లాలో చిరుధాన్యాల సాగు గతంలో కంటే ఇప్పుడు ముందంజలో ఉంది సజ్జలు, జొన్నలు, రాగలు, తదితర చిరుధాన్యాలలో పోషక విలువలు ఎక్కువగా ఉన్నందువలన చిరుధాన్యాల సాగుకు పూర్వవైభవం తీసుకువచ్చేలా వ్యవసాయ అధికారులు దృష్టి సాగిస్తున్నారు.

ప్ర : ఏఏ యంత్ర పరికాలను రైతులకు పంపిణీ చేస్తున్నారు?

జ : ప్రభుత్వం ఎంతోమంది రైతులకు వ్యవసాయ యంత్రాలు పరికరాలను సబ్సిడీ ధరకు పంపిణీ చేస్తుంది జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 384 యూనిట్లు సబ్సిడీ ధరలతో పంపిణీ చేశారు. వ్యవసాయ పరికరాలైన క్రషర్లు, విత్తన గోర్తులు,రోటవేటర్లు, టార్పాలిన్ పట్టలు, తిల్లర్లు, 40శాతంసబ్సిడీతో 13 శాతం రైతులు కాంట్రిబ్యూషన్ కట్టగా 60 శాతంలోన్ సౌకర్యం కల్పించి ఆర్బికే పరిధిలో ఒక్కొక్క యూనిట్ గ్రూపునకు 15 లక్షల రూపాయలు విలువచేసే యంత్ర సామాగ్రిని పంపిణీ చేస్తున్నాము.



భారీ వర్షానికి పొంగిపొర్లుతున్న వాగు

పుట్లూరులో 111.6 మి.మీ వర్షపాతం

ప్రజాశక్తి-పుట్లూరు

మండల వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి కురిసిన వర్షం 111.6 మిల్లీమీటర్లుగా నమోదైంది. దీంతో మండలంలోని కుంటలు, చెక్‌డ్యాంలకు జలకళ సంతరించుకుంది. గతేడాది నుంచి అనుకూలమైన వర్షపాతం నమోదు కావడం లేదు. ఈనేపథ్యంలో భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షం కారణంగా తాడిపత్రి-యల్లనూరు రోడ్డుతోపాటు ఎస్.తిమ్మాపురానికి వెళ్లే రహదారి నీటితో పూర్తిగా నిండిపోయింది. ఫలితంగా రాకపోకలు నిలిచిపోయాయి.

హెచ్ఎల్‌సికి గండి

బొమ్మనహాల్ : జిల్లాకు జీవనాధారమైన హెచ్ఎల్‌సికి కర్ణాటకలోని కురుగోడు సమీపంలో 77వ కిలోమీటర్ వద్ద ఆదివారం గండి పడిందని కర్ణాటక అధికారులు తెలిపారు. దీంతో హెచ్చెల్సీకి నీటి సరఫరా నిలిచిపోయింది. కాగా తరచూ కాలువకు గండ్లు పండుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా గండ్లు పడుతూ ఉంటే నీరు ఎప్పటికి చేరుతుందని వాపోతున్నారు. ఈ విషయంపై కణేకల్ డివిజన్ ఆఫీసర్ మద్దిలేటిని వివరణ కోరగా కర్ణాటకలో పైపింగ్ మన పరిధి కాదన్నారు.



హెచ్చెల్సీకి గండి పడి వృథాగా పోతున్న నీరు

నేరాలు ఘోరాలు

వృద్ధురాలు ఆత్మహత్య



సుంకమ్మ (పాతచిత్రం)

బెలుగుప్ప : అనారోగ్యంతో బాధపడుతూ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలోని నక్కలపల్లిలో చోటు చేసుకుంది. వివిరాల్లోకి వెళ్తే... నక్కలపల్లికి చెందిన బొడుమల్లి సుంకమ్మ (62)కు బిపి, షుగర్, కడుపునొప్పితో తరచూ బాధపడుతూ ఉండేది. ఎక్కడ చూపించినా ఆరోగ్యం కుదుట పడలేదు. ఈనేపథ్యంలో ఆదివారం కూడా తీవ్రమైన కడుపు నొప్పి వచ్చింది. దీంతో భరించలేక జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేనిసమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కూతురు, కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ రామదాసు తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి



కమలాకర్‌రెడ్డి (పాతచిత్రం)

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని బొమ్మక్కపల్లి గ్రామానికి చెందిన రైతు కమలాకర్‌రెడ్డి (34) తనపొలంలో పాముకాటుకు గురై మృతిచెందాడు. కమలాకర్‌రెడ్డి తన పొలంలో మొక్కజొన్న కంకులనుకోయిస్తుండగా ఆదివారం పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం వెంటనే నేత్రపల్లిలో నాటువైద్యం చేయించారు. అక్కడి నుంచి ఇంటికి వచ్చిన కాసేపటికే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

టోల్‌ప్లాజా బూత్‌ను ఢీకొన్న బస్సు

గుత్తి : పెద్దవడుగూరు మండలం కాసేపల్లి టోల్‌ప్లాజా బూత్‌ను ఆదివారం తెల్లవారుజామున ఓ ప్రయివేటు బస్సు ఢీకొంది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న ప్రయివేటు బస్సు టోల్ ప్లాజాలో రుసుం చెల్లించే సమయంలో అదుపుతప్పి 6వ బూత్‌ను ఢీకొనంది. అయితే ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. బూత్‌లో ఉన్న రవి అనే టోల్‌ప్లాజా ఉద్యోగి పక్కకు వెళ్లడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృతి

గుత్తి : గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ జింక మతి చెందింది. జింక జాతీయ రహదారిని దాటుతుండగా కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా పడ్డ జింకను సమీపంలోని హెూటల్ నిర్వాహకులు చేరదీశారు. అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. అటవీశాఖ అధికారులు గుత్తి పట్టణంలోని పశు వైద్యశాలలో చికిత్స చేయిస్తుండగా ఆదివారం జింక మృతి చెందింది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి : పట్టణంలోని కమటం వీధికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కమాటం వీధికి చెందిన ఖలందర్ కుటుంబ సమస్యలతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష ద్రావకం తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అతన్ని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి నీలమయ్య

ఓటర్ల తొలగింపుపై విచారణ

రాయదుర్గం రూరల్ : రాయదుర్గంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో తొలగించిన ఓట్లపై నియోజకవర్గ ప్రత్యేకాధికారి నీలమయ్య ఆదివారం క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. రాయదుర్గం నియోజకవర్గంలో తొలగించిన జాబితాలో మరణించిన, రెండు చోట్ల ఓటుహక్కు కలిగి ఉన్నవి సుమారు 6,000 పైచిలుకు ఓట్లను తొలగించినట్లు ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాత తెలిపారు. ఇందులో భాగంగా రాయదుర్గంలోని ఓబులాచారి రోడ్డు పరిధిలో ఉండే 216, 217, చర్చి ఏరియా పరిధిలో ఉండే 181వ నెంబర్ పోలింగ్‌స్టేషన్ల ఓట్ల తొలగింపుపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మారుతి, ఆర్ఐ జీవన్, ఎన్నికల సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చెలగాటం

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-ఉరవకొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి యాత్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం కూడేరు మండలంలో సాగింది. ముందుగా పేదల నడ్డి విరుస్తున్న కరెంటు బిల్లులను తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, వ్యవసాయానికి 9 గంటలు నిరంతరాయంగా నాణ్యమైన కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలన్నారు. అనంతపురం జిల్లాలో ఇప్పటికే 15ఏళ్ల నుంచి అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు అప్పులు పాలై ఆత్మహత్యలు చేసుకుంటారన్నారు. కావున జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి సాగు చేసిన ప్రతి ఎకరాకూ రూ.50వేలు, సాగు చేయని రైతులకు ఎకరాకు రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో 200 రోజులు ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులను వెంటనే కూలీల ఖాతాలక జమ చేయాలని, రోజుకు రూ.600 తగ్గకుండా కూలి పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేశులు, మల్లికార్జున, ఈశ్వరయ్య, శంకరయ్య, చిదంబరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కరెంటు బిల్లులను దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

గుంతకల్లు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిపిఎం చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు చేపట్టనున్న ఆందోళనకు ప్రజలు భారీగా కదలి రావాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో పట్టణంలోని అన్నివార్డుల్లో పలు సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ముఖంయగా పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టకుండా సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, రూ.400కే వంట గ్యాస్ ఇవ్వాలని, నిత్యావసర ధరలు తగ్గించాలని, పెట్రో ధరలను నియంత్రించాలని, ప్రజా పంపిణీ ద్వారా 12 రకాల సరుకులు సబ్సిడీతో స్టోర్లలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సిపిఎం పట్టణ కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, సాకే నాగరాజు, కసాపురం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో ఇద్దరు అధ్యాపకురాళ్లకు ఉత్తమ అవార్డులు



పద్మసువర్ణ వి.వి.చిత్ర

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలోని ఇద్దరు అధ్యాపకురాళ్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. వీరిలో ఒకరు ఇంగ్లీష్ విభాగానికి చెందిన డాక్టర్ వి.బి.చిత్ర, ఫిజిక్స్ విభాగనికి చెందిన డాక్టర్ ఆర్.పద్మ సువర్ణ ఉన్నారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖామంత్రి వీరికి అవార్డులు అందజేయనున్నారు.

ఎస్కేయూలో ఇద్దరు ప్రొఫెసర్లకు...



శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ లో ఇద్దరూ ప్రొఫెసర్లకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. సోషియాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ జివి రమణకు, భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ రాంగోపాల్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి. వీరు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ మంత్రితో అవార్డులు అందుకోనున్నారు.

మూఢనమ్మకాలను పెంచి పోషిస్తున్న కేంద్రం

జెవివి మహాసభల్లో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూఢనమ్మకాలు, అశాస్త్రీయ అంశాలు కోర్సులుగా పెట్టి మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని జనవిజ్ఞాన వేదిక నాయకులు విమర్శించారు. ఆదివారం కళ్యాణదుర్గంలోని డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక అనంతపురం జిల్లా 17వ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జెవివి జెండాను సీనియర్ నాయకులు రామాంజనేయులు ఆవిష్కరించారు. అనంతరం ప్రజాసైన్స్ ఉద్యమంలో అసువులు బాసిన ఈశ్వరయ్య, పెద్దన్న, జయం బాలకృష్ణ, జంపా కృష్ణకిషోర్, మణికి సంతాపం ప్రకటించారు. తర్వాత ఇటీవల మరణించిన గద్దర్, జహిరుద్దీన్‌తోపాటు పలువురు సినీ కళాకారులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రతినిధుల సభలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, జెవివి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రంగన్న మాట్లాడుతూ ప్రజాసైన్స్ ఉద్యమంలో 38 ఏళ్లుగా జన విజ్ఞాన వేదిక రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను శాస్త్ర విజ్ఞానం వైపు మళ్లించిందన్నారు. ముఖ్యంగా మూఢనమ్మకాలు, అక్షరాస్యత, మద్యపాన నిషేధానికి ఎనలేని కృషి చేసిన ఘనత జెవివికే దక్కిందన్నారు. అయితే ఇటీవల కేంద్ర ప్రభుత్వం డార్విన్ పరిణామ సిద్ధాంతం, పీరియాడిక్ టేబుల్ సహా పలు రకాల సైన్స్ పాఠాలు తొలగించడం బాధాకరమన్నారు. అలాగే శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి, పరిశోధనలకు తగిన నిధులు మంజూరు చేయకపోడం తగదన్నారు. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతంతో శాస్త్రవేత్తల కృషిని కొనియాడారు. కాగా సంక్షోభంలోఉన్న జిల్లా వ్యవసాయ, చేనేత రంగాలను ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో జెవివి బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్ కంచె లక్ష్మీనారాయణ, సమత, విభాగం కన్వీనర్ డాక్టర్ ప్రసూన, ఆహ్వాన కమిటీ నాయకులు కంబాల తిమ్మారెడ్డి, చల్లా కిషోర్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



మహాసభల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

సమాజంలో గురువులకు అత్యున్నత స్థానం

జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం



సన్మానం పొందిన గురువులతో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అతిథులు

సమాజాన్ని ప్రభావితం చేసే ఏకైక వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అలాంటి గురువుకు సమాజంలో అత్యున్నత స్థానం ఉందని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుల సుంకర రమేష్ నేతృత్వంలో జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో ఉత్తమ ఉపాధ్యాయులకు ఆదివారం పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వారు నాలుగేళ్లుగా ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేస్తుండటం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పతికి రమేష్‌నారాయణ, ఐక్యరాజ్యసమితి అవార్డు గ్రహీత బిసాటి భరత్, పండిట్ రియాజుద్దీన్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్‌కుమార్, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షురాలు దివ్యతేజ, ఉపాధ్యక్షుడు దీప్‌కిరణ్‌రెడ్డి, కార్యదర్శి నందిత, స్వప్న, గాయత్రి, జోష్ణ, గణేష్, పవన్, అలేఖ్య, బాలాజీ, కీర్తి, భూషణ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలుగా విష్ణుప్రియ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



విష్ణుప్రియ

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలు (వృక్షశాస్త్రం)గా ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు ఎం.విష్ణుప్రియ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ బోధన అందించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులను అవార్డులకు ఎన్నిక చేసిన జాబితాలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు విష్ణుప్రియ ఉన్నారు. ఈమె ఆంధ్ర యూనివర్శిటీ నుంచి ఎమ్మెస్సీ పట్టాను విశ్వవిద్యాలయం స్థాయిలో మొదటి ర్యాంకును సాధించింది. అంతేగాకుండా సిఎస్ఐఆర్ నెట్‌లో కూడా ఆల్ ఇండియా 21వ ర్యాంక్‌ను సాధించింది. 24 ఏళ్ల వయసులోనే డిగ్రీ కళాశాల అధ్యాపకురాలిగా మడకశిర కళాశాలలో మొదటగా చేరారు. 2015 నుంచి 2021 సెప్టెంబర్ వరకు కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో, 2021 సెప్టెంబర్ నుంచి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వృక్షశాస్త్రం అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. కఠిన క్రమ శిక్షణ, కఠోర విద్యాభ్యాసం విష్ణు ప్రియ ప్రత్యేకత. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల అటానమస్ అనంతపురం వృక్షశాస్త్ర విభాగానికి సంబంధించి విష్ణుప్రియ రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, శ్రేయోభిలాసులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

'పోలా' మృతి బాధాకరం

అనంతపురం : పోలా రామాంజనేయులు మృతి బాధాకరమని ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు పామిశెట్టి గోవిందు అన్నారు. ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా, సిపిఎం సీనియర్ నాయకులుగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

మరో పోరాటానికి సిద్ధం కండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ కార్మికులు మరో పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగేంద్రకుమార్ పిలుపునిచ్చారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల అధ్యక్షతన ఆదివారం గణేనాయక్ భవన్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఎన్నికల ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలను చేయాలన్నారు. అంగన్వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచుతామని నాలుగున్నర సంవత్సరాలు వేతనాలు పెంచలేదన్నారు. రిటైర్మెంట్ వయస్సు 65 సంవత్సరాలకు పెంచాలన్నారు. గ్రాట్యూటి అమలు చెయ్యాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. మిని సెంటర్‌లను మెయిన్ సెంటర్‌లుగా మార్చాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచి సిఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. తెలంగాణాలో 2021 జూలై నెల నుండి వర్కర్లకు రూ.13,650, హెల్పర్, మినీ వర్కర్క రూ.7,800 ఇస్తున్నారని తెలిపారు. కాని మన రాష్ట్రంలో అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదన్నారు. ఇటీవల తెలంగాణా ప్రభుత్వం అంగన్వాడీలకు రిటైర్మెంట్ వయస్సు 65 సంవత్సరాలకు పెంచిందన్నారు. మిని సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చెయ్యటంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్ పెంచారని తెలిపారు. కావున ఆంధ్రప్రదేశ్‌లో కూడా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మిని వర్కర్లకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. మిని సెంటర్లనుమెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అంగన్వాడీలు మరో పోరాటానికి సిద్ధమవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, జిల్లా కోశాధికారి జమున, జిల్లా నాయకులు కాత్యాయని, లావణ్య, అరుణ, రేష్మ, తిప్పిరమ్మ, విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

కూలిన బ్రిడ్జిలను నిర్మించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలో పలుచోట్ల కూలిన బ్రిడ్జిలను నిర్మించి ప్రజల కష్టాలను తీర్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అనేక దారుల్లో ఉన్న బ్రిడ్జిలు గుంతలు పడి కూలిపోయాయన్నారు. దీంతో విద్యార్థులు, ప్రజలు, రైతులు నానా ఇబందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా హెచ్ఎల్‌సి కాలువ మీద బ్రిడ్జి కూలిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే సంజీవపురం వద్ద బ్రిడ్జి కూలి ఏళ్ళ గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, నాయకులు స్పందించి మండలవ్యాప్తంగా కూలిన బ్రిడ్జిలను వెంటనే నిర్మించాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కుళ్లాయప్ప, సిఐటియు నాయకులు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



సంజీవపురం దగ్గర కూలిపోయిన బ్రిడ్జి

'ఉపాధి'లో అవినీతికి పాల్పడితే చర్యలు

ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఉపాధి హామీ పథకంలో సిబ్బంది అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీలు చేపట్టి పంచాయతీల వారీగా వివరాలు సేకరించారు. ఇందులో మండల వ్యాప్తంగా చేపట్టిన రూ.12.5కోట్ల పనులు చేపట్టారు. ఇందులో రూ.6,87,790 అవినీతి జరిగిందని గుర్తించి రికవరీకి ఆదేశించినట్లు ఎస్ఆర్ వెంకటేష్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, విజిలెన్స్ జిల్లా ఆఫీసర్ రమణారెడ్డి, మండల అధ్యక్షురాలు దాసరి సునీత, జిల్లా ప్రాదేశిక సభ్యులు నీలం భాస్కర్, ఎంపిడిఒ విజయభాస్కర్, జిల్లా అంబుడ్స్ పర్సన్ జోగి మధుసూదన్, తనిఖీ బృందం సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఎపిఒ పోలేరయ్య, శ్రీదేవి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

సంక్షేమంపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం

గుంతకల్లు : పేదల సంక్షేమంపై వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర ఆదివారం కర్నూలు జిల్లా నుంచి గుత్తి మీదుగా గుంతకల్లుకు చేరుకుంది. ఇందులో భాగంగా పట్టణ పరిధిలోని దోనిముక్కల రోడ్డులో ఉన్న జగనన్న కాలనీని పరిశీలించారు. అనంతరం పట్టణంలోని పొట్టిశ్రీరాములు కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పేదల ప్రభుత్వం అని చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం పెద్దలకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సెంటుస్థలంలో ఇంటి నిర్మాణం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. అంతేగాకుండా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు ఏమాత్రం సరిపోదన్నారు. కనీసం రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, రామాంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంకాలమ్మకు ప్రత్యేక పూజలు

బెలుగుప్ప: బెలుగుప్ప తండాలో వెలసిన గిరిజనుల ఆరాధ్య దైవం కంకాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం రాత్రి 12 గంటలకు కంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట చేశారు. కాగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ రామునాయక్, గోవిందనాయక్, లక్ష్మానాయక్, తిప్పేస్వామినాయక్, పాండురంగనాయక్, నాగరాజునాయక్, శ్రీనివాస్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి తవ్వకంపై హర్షం

గుత్తి : పట్టణంలోని బీసీ కాలనీలో ఉన్న కెపిఎస్ సినిమా థియేటర్ వెనుక ప్రాంతంలో కౌన్సిలర్ కె.సుచరిత, వైసిపి జిల్లా నాయకులు కె.మధుసూదన్‌రెడ్డి శనివారం రాత్రి తాగునీటి బోరు వేయించడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో తాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రజలు సమస్యను కౌన్సిలర్ దంపతుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారానికి తాగునీటి పథకం ఏర్పాటుకు చర్యల్లో భాగంగా బోరును వేయించారు. స్పందించి సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టిన కౌన్సిలర్ దంపతులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



బోరు వేస్తున్న దృశ్యం

చంద్రబాబుతోనే యువత భవిష్యత్తుకు 'భరోసా'

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

టిడిపి అధినేత చంద్రబాబు ద్వారానే రాష్ట్ర ప్రజలతోపాటు యువత భవిష్యత్తుకు భరోసా అని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 30 నియోజకవర్గాల్లో దాదాపు కోటి కుటుంబాలను కలిసేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని రాయదుర్గం నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో భాగంగా చంద్రబాబు ఈనెల 5న రాయదుర్గంలో పర్యటించనున్నట్లు తెలిపారు. కాగా అవినీతిపరుడు, రూ.వేలకోట్లు దోచుకున్న జగన్ రాష్ట్రానికి సిఎంగా దాపురించడం బాధాకరమన్నారు. విధ్వంసకరంగా సాగిస్తున్న ఈ నాలుగున్నరేళ్ల పాలనలో వ్యవస్థలు ఛిద్రం అయిపోయాయన్నారు. జగన్ రాక్షసతాన్ని చూసి ప్రజలు భయకంపితులవుతున్నారు. విసిగిపోయిన ప్రజలు బాబు నాయకత్వాన్ని కోరుతున్నారన్నారు. దీంతో భవిష్యత్తుకు భరోసానిచ్చేది చంద్రబాబు మాత్రమేనని రాష్ట్ర ప్రజలు ఏకపక్షంగా టిడిపిని గెలిపించేందుకు కంకణ బద్ధులై ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

చంద్రబాబు పర్యటన ఇలా..

ఈనెల 5న మొదట బళ్లారి సమీపంలోని విద్యానగర్ (జిందాల్) విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన సమీపంలో నిర్మాణంలో ఉన్న శివాలయాన్ని సందర్శిస్తారు. అక్కడి నుంచి బళ్లారిలోని కమ్మభవన్ కళ్యాణ మండపంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గన సాయంత్రం నాలుగు గంటలకు ఆంధ్ర సరిహద్దు ఓబులాపురానికి చేరుకోగానే పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలుకుతారు. ఇందులో భాగంగా బాదనహాల్ వద్ద తెలుగుదేశం నాయకులు నిర్మించిన వేదావతి–హగరి వంతెనపైకి చేరుకోగానే సెల్ఫీ తీసుకుంటారు. అక్కడి నుంచి రాయదుర్గం మండలం పల్లేపల్లి గ్రామానికి చెందిన వేరుశనగ సాగు చేసి నష్టపోయిన రైతులతో చంద్రబాబు మాట్లాడతారన్నారు. అనంతరం రాయదుర్గంని శాంతినగర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినాయక సర్కిల్ మీదుగా తేరుబజార్‌కు రోడ్‌షో ద్వారా చేరుకుంటారు. అక్కడ బహిరంగ సభలో పాల్గొని కనేకల్ రోడ్డులో ఉన్న ఎంసిఎ కళాశాలలో బస చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు రాజు, పురుషోత్తం,మాబు, జలీల్, తిప్పయ్య, కాలువ సన్నయ్య , నాగరాజు , తదితరులు పాల్గొన్నారు



నార్పలశేఖర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

దొంగలను పట్టుకోవాలని వినతి

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని బి.పప్పూరు వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లను చోరీ చేసిన దొంగలను పట్టుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్, సిపిఎం, సిపిఐ, ఎంఆర్‌పిఎస్, కెవిపిఎస్, దళిత స్టూడెంటు యూనియన్ నాయకుల మాట్లాడుతూ 15వతేదీలోపు దొంగలను పట్టుకోకపోతే దళిత, ప్రజా సంఘాల నాయకులను కలుపుకుని చలో బి.పప్పూరు కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. పాఠశాలకు తాళం పగులగొట్టి సుమారు రూ.8లక్షలు విలువజేసే కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు చోరీ చేసినా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి చోరీకి పాల్పడిన నిందితులను అరెస్టు చేయడంతోపాటు కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, ఎంఆర్‌పిఎస్ నాయకులు రంగాపురం పుల్లప్ప, గడ్డంనాగేపల్లి హనుమంతు, గంగయ్య, నార్పల రాజగోపాల్, ఎస్‌వి రమణ, రాజు, కుళ్లాయప్ప, నారాయణ, నార్పల బయన్న, ఆంధ్రప్రదేశ్ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చిన్న ఆంజనేయులు, సిపిఐ నాయకులు గంగాధర్, సుధాకర్, రమేష్, నారాయణప్ప, పెద్దన్న, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు ఏకతాటిపైకి రావాలి

పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు పొడరాళ్ల రవీంద్ర

ప్రజాశక్తి-అనంతపురం



నూతన సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

పద్మశాలీలందరూ ఏకతాటిపైకి వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు పొడరాళ్ల రవీంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని మార్కండేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పద్మశాలీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి సంఘటితం కావాలన్నారు. ముఖ్యంగా వస్త్ర వ్యాపారులపై దాడులను ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు చేనేత కులాలపైన చిన్నచూపు చూస్తే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాబోయే కాలంలో జిల్లాలో పెద్దఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేసి మనమేందో చూపుదామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత వృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు చేయూతనివ్వాలని, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జింకా సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పోతుల లక్ష్మీనరసింహులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, వగ్గా రాజశేఖర్, పోరాళు గోవిందరాజులు, ఆరవ శివప్ప, అవ్వరు అశోక్‌కుమార్, కొంతం శివరుద్ర, సుజాత, రంగప్రసాద్, తాడూరు చంద్రశేఖర్, గుర్రం యుగంధర్, శివ, జానపాటి సత్యనారాయణ, జక్కా వెంకట్రామయ్య, మహేశుల చంద్రశేఖర్, దేవరకొండ నరసింహులు, రాజేంద్రప్రసాద్, జింకా సత్యనారాయణ, మహిళలు, పద్మశాలీలు పాల్గొన్నారు.

ప్రజాచైతన్య కవి గద్దర్

సంతాప సభలో నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

పాటలతో ప్రజలను చైతన్య పరిచిన మహామేధావి, గొప్ప కవి గద్దర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని మేవా అధ్యక్షులు సుగమంచి సురేష్, మాల మహానాడు ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు దళితరత్న ఎం.ఓబులేసు, జిల్లా అధ్యక్షులు గడ్డం ముత్యాలప్ప, ప్రధాన కార్యదర్శి కోళ్ల రమేష్ కొనియాడారు. ఆదివారం మాల ఉద్యోగుల సంఘం, మాల మహానాడు, సమతా సైనిక్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధ్యాయ భవన్‌లో గద్దర్ సంతాప సభ నిర్వహించారు. ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్దర్ దళితుల అభివృద్ధికి కృషి చేస్తూనే వెనుకబాటు తనం, వివక్ష, దౌర్జన్యాలు, అనాయాలను ఎదురించి ధీశాలి అన్నారు. కవిగా, సినిమా రచయితగా, గాయకుడిగా, సమాజ శ్రేయోభిలాషిగా గద్దర్ అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. గొప్ప గాయకుడిని కోల్పోయినా ఆయన గాత్రం ద్వారా మన ముందు సజీవంగా ఉంటారని తెలిపారు. అలాంటి గొప్ప వ్యక్తులను స్మరించుకుంటూ నివాళి అర్పించడం అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌డి జిల్లా అధ్యక్షులు సుగమంచి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మల్లేష్, మాల మహానాడు మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కె.కమలమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి పవిత్ర, యూత్ అధ్యక్షులు ఎన్.నరేష్, వెంకటేష్, ప్రసాద్, బండారు రామాంజినేయులు, విజయ్, సురేష్, కళాకారుల సంఘం తరిమెల రాజు తదితరులు పాల్గొన్నారు.

15లోపు ఈక్రాప్ నమోదు పూర్తిచేయాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ఈనెల 15వతేదీలోపు పంటలు సాగు చేసిన రైతులు ఈక్రాప్ నమోదు పూర్తి చేయాలని రాయదుర్గం ఎడిఎ లక్ష్మానాయక్ సూచించారు. ఆదివారం మండల పరిధిలోని 74 ఉడేగోళం రైతుభరోసా కేంద్రం పరిధిలో చేపట్టిన ఈక్రాప్ నమోదును స్థానిక వ్యవసాయ అధికారి మహేంద్రతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 56215 హెక్టార్లలో పంట సాగు చేయగా ఇప్పటి వరకూ కేవలం 22162 హెక్టార్లలో మాత్రమే పంట నమోదు పూర్తయిందన్నారు. ముఖ్యంగా డి.హీరేహాళ్ మండలంలో పంటల నమోదు పూర్తిగా తక్కువ శాతం ఉందన్నారు. ఈ మండలంలో పురోగతి సాధించాలన్నారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను పాటిస్తూ ఏ రైతు ఏ పంట సాగు చేసి ఉంటే ఆ పంటను ఖచ్చితమైన విస్తీర్ణం నమోదు చేయాలన్నారు. ఉద్యాన శాఖ అధికారి రైతు భరోసా కేంద్రం సిబ్బందికి కావాల్సిన వివరాలు అందించి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : మండలంలోని నేమితాబాదు గ్రామంలో ఆదివారం చేపట్టిన పంట నమోదును వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.వెంకటరాముడు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించి రైతు భరోసా కేంద్రాల్లో ఏవోలు రోజువారి పురోగతిని పరిశీలిస్తూ సిబ్బందికి తగు సూచనలు చేయాలన్నారు. ఈనెల 15 తేదీలోగా ఈ క్రాప్ నమోదును తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి వ్యవసాయ అధికారి ముస్తాక్ అహ్మద్, ఎంపీఈఓ మెర్సీ, వీఏఏ దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో ఈక్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఎడిఎ లక్ష్మానాయక్